
రంజాన్ వేళలు
ఇఫ్తార్ - శుక్రవారం
సాయంత్రం - 6.31
సహర్ - శనివారం
ఉదయం - 5.02

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మేడ్చల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో చిచ్చు రేగుతోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల దాకా రాష్ట్రంలోకెల్లా పార్టీకి పట్టున్న నియోజకవర్గంగా మేడ్చల్‌ను బీఆర్ఎస్ భావించింది. ఎన్నికల్లోనూ మంచి మెజారిటీతోనే ఎమ్మెల్యే సీటును కైవసం చేసుకుంది. కానీ ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ అధికారం కోల్పోవడంతో కిందిస్థాయి నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- విహారయాత్రలతో సంతృప్తి పరుస్తున్నా బీఆర్ఎస్‌లో తిరుగుబాటు
- కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో తప్పని ఇబ్బందులు
- ఏమైనా చేసుకోండి.. ఎటైనా పోండి!
- చేతులెత్తేసిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి
- పార్టీ మారే యోచనలో మున్సిపల్ చైర్‌పర్సన్లు

ఆగని.. తిరుగుబాటు!





మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల లొల్లి..

మేడ్చల్(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి)/మేడ్చల్ టౌన్, మార్చి 14 : మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఒకప్పుడు క్రమశిక్షణకు మారు పేరు అంటూ గొప్పలు చెప్పుకునే బీఆర్ఎస్ నేతలు ప్రస్తుతం ఎవరికి వారే యమునా తీరే అన్న ధోరణిలో ఉన్నారు. ఇష్టమొచ్చినట్లు తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఫలితంగా నియోజకవర్గంలోని ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏకంగా తమ సొంత పార్టీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టి పార్టీ పెద్దల కంటికి కునుకు లేకుండా చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సైతం చేతులెత్తేయడంతో చైర్‌పర్సన్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రోజురోజుకూ మారుతున్న రాజకీయ సమీకరణలతో నియోజకవర్గంలో ఎప్పుడైనా కొత్త పరిణామాలు చోటు చేసుకునే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు బీఆర్ఎస్ ఆధీనంలో ఉండగా జవహర్‌నగర్ ఇటీవలే చేజారింది. ప్రధానంగా అధికారంలో ఉన్న నాడే బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తమ పార్టీ చైర్మన్లపై అవిశ్వాస బావుటా ఎగరవేశారు. అప్పట్లో అధికార బలంతో అవిశ్వాసాలను తెరపైకి రాకుండా పార్టీ పెద్దలు అనేక ప్రయాసలు పడి నాయకులను బుజ్జగించి అవిశ్వాస సెగలను చల్లార్చారు. అయినప్పటికీ రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో తూంకుంట, నాగారం మున్సిపాలిటీల్లో పెట్టిన అవిశ్వాసాలు నెగ్గాయి. మిగతా కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ముందు జాగ్రత్త చర్యలుగా విహార యాత్రలు చేపట్టినా తిప్పలు తప్పడం లేదు.

తెరపైకి గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మునిసిపాలిటీలు

ప్రస్తుతం గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీలు నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎమెల్యే మల్లారెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డి సతీమణిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంప్ రాజకీయాలు నడుపుతున్నారు. ఇప్పటికే చైర్‌పర్సన్ భర్త మద్దుల శ్రీనివాస్‌రెడ్డి.. వైస్ చైర్మన్ ప్రభాకర్‌తోపాటు మరో ఆరుగురు కౌన్సిలర్లతో బ్యాంకాక్‌కు మకాం మార్చారు. మొత్తం 15 కౌన్సిలర్లు ఉన్న మున్సిపాలిటీలో ఒకరు కాంగ్రెస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు ఉండగా మిగతా వారంతా బీఆర్ఎస్‌కు చెందిన వారే. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి అవిశ్వాసానికి ఏమాత్రం బలం లేకున్నా బీఆర్ఎస్ నేతల మధ్య చోటు చేసుకున్న భేదాభిప్రాయాలతో కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల సాయంతో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే సొంత బావమరిదిని సైతం వదలకుండా కౌన్సిలర్లు పాచికలు వేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్ పురపాలికలోనూ ఇదే పరిస్థితి ఉంది. కౌన్సిలర్లను ఇటీవల దుబాయ్, గోవా ట్రిప్పులకు తిప్పినా యాత్రలు ముగియగానే పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇక్కడా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం!

విహారయాత్రలకు వెళ్లినా మళ్లీ మొదటికే..

ఇప్పటికే అలిగిన నేతలను మల్లారెడ్డి బుజ్జగించటానికి విదేశీ విహార యాత్రలకు తీసుకెళ్లిన దాఖలాలు ఉన్నాయి. మరి కొందరికి అడిగినంత డబ్బులు ఇప్పించి గప్‌చుప్ చేసినట్టు పార్టీ శ్రేణులు గుసగుసలాడుకుంటున్నాయి. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలు మల్లారెడ్డికి మానస పుత్రికలు కావటం గమనార్హం. మల్లారెడ్డి విద్యాసంస్థలు ఇక్కడే ఉన్నందున ఇక్కడ పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టారు. అయినప్పటికీ ఇక్కడ సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం వైపు అడగులు వేయటం మల్లారెడ్డికి సవాల్‌గా మారింది. కౌన్సిలర్లను ఇటీవల దుబాయ్, గోవా ట్రిప్పులకు తిప్పినప్పటికీ యాత్రలు ముగియగానే పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది!

దిక్కుతోచని స్థితిలో చైర్‌పర్సన్లు

ఇప్పటి వరకూ నియోజకవర్గంలోని చైర్‌పర్సన్లకు పెద్ద దిక్కుగా ఉన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి కూడా చేతులెత్తేయడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తాజాగా పలువురు ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలవగా.. 'మీరు ఏమైనా చేసుకోండి. ఏ పార్టీలోకైనా వెళ్లండి.' అనే సమాధానం ఆయన నుంచి రావడంతో వారంతా బిత్తరపోయినట్లు తెలిసింది. దీంతో నేతలు ఇక తమకు దిక్కెవరని ఆవేదన చెందుతున్నారు. అసమ్మతి సెగలను ప్రారంభంలోనే అంతమొందించాల్సిన ఎమ్మెల్యే ఈ విషయంలో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మున్సిపల్ కార్పొరేటర్లకు, కౌన్సిలర్లకు బీ ఫారాలు ఇచ్చే విషయంలో మల్లారెడ్డి డబ్బులు ఖర్చు పెట్టే వారికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వారినే ఎన్నికల రంగంలోకి దించారు. అనంతరం మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎంపికలో కౌన్సిలర్లకు, కార్పొరేటర్లకు అడిగినంత డబ్బులు ఇప్పించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో నేతల్లో సేవాభావం కన్నా డబ్బుపై వ్యామోహం పెరిగి చివరికి మల్లారెడ్డి మాటను కూడా లెక్కచేయని పరిస్థితి నెలకొంది.

అసమ్మతులకు ఉప్పందిస్తున్న కాంగ్రెస్

అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు తగిన సంఖ్యా బలం కాంగ్రెస్ పార్టీకి లేదు. అయినప్పటికీ బీఆర్ఎస్‌లో నేతల మధ్య ఉన్న భేదాభిప్రాయాలను కాంగ్రెస్ క్యాష్ చేసుకుంటోంది. ఆ దిశగా పావులు కదుపుతోంది. అనుకున్న మేరకు ఫలితాలు రానప్పటికీ బీఆర్ఎస్‌ను దెబ్బ తీయటానికి ఏ ఒక్క అవకాశాన్నీ పాలక పార్టీ వదలడం లేదు. తమ పార్టీకి చైర్మన్ పదవి దక్కదన్న విషయం తెలిసినా బీఆర్ఎస్‌లోని అసమ్మతి నేతల మధ్య చిచ్చు పెడుతూ పార్టీని కలవరానికి గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. అధికారం కోల్పోయి బీఆర్ఎస్ నాయకులు ఉనికిని కాపాడుకునే దిశలో కార్యకలాపాలు చేపడుతుండగా మున్సిపాలిటీల వ్యవహారం బీఆర్ఎస్‌కు రోజుకో కొత్త టెన్షన్ పెడుతోందని పార్టీ నాయకులు అంటున్నారు.

కాంగ్రెస్ గూటికి ఘట్‌కేసర్, పోచారం మున్సిపల్ చైర్‌పర్సన్లు?

- చేరికలపై దృష్టి సారించిన కాంగ్రెస్ నేతలు
- ఇప్పటికే పలుమార్లు చర్చలు
- లోక్‌సభ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఖాళీ!


పావనియాదవ్, చైర్‌పర్సన్, ఘట్‌కేసర్

ఘట్‌కేసర్, మార్చి 14 : ఘట్‌కేసర్ మండలంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతోంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అధికార కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారిలో ఇద్దరు కాంగ్రెస్ నుంచి గెల్చిన వారే. ప్రస్తుతం మున్సిపల్ చైర్‌పర్సన్లు సైతం కారు పార్టీని వీడి హస్తం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ఒకరిద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరుతారని తెలుస్తోంది. అలాగే పోచారం మున్సిపాలిటీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఎన్నికలకు ముందు వరకూ ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు పట్టు ఉండేది. ఇక్కడి ప్రస్తుత ఎమ్మెల్యే సైతం బీఆర్ఎస్‌కు చెందిన వారే. కాగా ఇప్పటి వరకు పోచారం మున్సిపాలిటీలో నాయకులే తప్ప ప్రజాప్రతినిధులు పార్టీ మారలేదు. బుధవారం రాత్రి ప్యాక్స్ చైర్మన్ బద్దం అనంతరెడ్డి, ఆయన కుమారుడు నర్సింహారెడ్డి, 200 మంది వివిధ యువజన సంఘాల సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పార్టీ వీడరనే నమ్మకం లేక ఇప్పటి నుంచే తమ దారి తాము చూసుకోవడమే మేలని పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. రానున్న కొద్ది రోజుల్లోనే పోచారంలో బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడనుంది. లోక్‌సభ ఎన్నికలు కాగానే స్థానిక సంస్థల ఎన్నికలు రానుండడంతో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయాలంటే ఇప్పటి నుంచే ఆ పార్టీలో చేరితేనే బాగుంటుందనే ఆలోచనల్లో బీఆర్ఎస్ పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులను కాంగ్రెస్‌లో చేర్పించేందుకు పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌లతో టచ్‌లో ఉన్నారు. వారితో పలు సందర్భాల్లో చర్చలు సైతం జరిపారు. ఇదిలా ఉంటే మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సొంత మండలం సైతం ఘట్‌కేసరే కాబట్టి ఆయన మండలంలోని మునిసిపాలిటీల ప్రజాప్రతినిధులను కాంగ్రెస్‌లో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు చర్చలు సైతం జరిపారు. ఇదే విషయాన్ని సుధీర్‌రెడ్డి గత బుధవారం అన్నోజిగూడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోకి రావాలనుకుంటున్న వారితో స్థానిక నాయకత్వమే చర్చించి ఆహ్వానించాలని వజ్రేష్ సైతం సూచించారు. కబ్జాదారులు, వివిధ కేసుల్లో ఉన్న వారిని, వివాదాస్పదులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోం అని ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల నాటికల్లా మున్సిపాలిటీల్లో, రూరల్ మండలంలో బీఆర్ఎస్ ఖాళీ అయ్యే పరిస్థితులే స్పష్టంగా కన్పిస్తున్నాయి.


కొండల్‌రెడ్డి, చైర్మన్, పోచారం

మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి

- శంభీపూర్ రాజును మార్చిన కేసీఆర్
- చక్రం తిప్పిన హరీశ్‌రావు
- కాంగ్రెస్ ఓటమే లక్ష్యంగా పావులు

మేడ్చల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఉప్పల్‌కు చెందిన రాగిడి లక్ష్మారెడ్డిని ఖరారు చేశారు. ఈ విషయాన్ని గురువారం సాయంత్రం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేసేందుకు మొదట మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి ఆసక్తి చూపినా తదనంతర పరిణామాలతో తమ కుటుంబం నుంచి ఎవరూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయడం లేదని మల్లారెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా బుధవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పోటీలో ఉంటాడని ప్రకటించినప్పటికీ తిరిగి లక్ష్మారెడ్డి పోటీలో ఉంటారని కేసీఆర్ ప్రకటించడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికల వరకు ఊపులో ఉన్నా.. బీఆర్ఎస్ నుంచి ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన లక్ష్మారెడ్డి టికెట్ రాక చివరి నిమిషంలో బీఆర్ఎస్‌లో చేరారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నా ఆ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

ఎమ్మెల్యే హరీశ్‌రావు జోక్యంతోనే!

కాగా మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఎంపికలో చివరి నిమిషంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చక్రం తిప్పినట్లు తెలిసింది. మొదట కేటీఆర్ శంభీపూర్ రాజును పోటీ చేయాలని ఆదేశించినా సామాజిక గణాంకాల ఆధారంగా అభ్యర్థిని మార్చినట్లు తెలుస్తోంది. మాల్కాజిగిరి బీజేపీ అభ్యర్థిగా ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ప్రకటించింది. ఆయన ప్రచారాన్ని సైతం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థే పోటీలో ఉంటారని సమాచారం. బీఆర్ఎస్ నుంచి బీసీ అభ్యర్థిని పోటీలో నిలిపితే కాంగ్రెస్ పార్టీకి మేలు చేకూరుతుందనే ఉద్దేశ్యంతోనే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మార్చి ఉప్పల్‌కు చెందిన ఓసీ వర్గానికి చెందిన రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపిక చేసినట్లు తెలిసింది. తాము గెలువకున్నా పర్వాలేదు గానీ కాంగ్రెస్ అభ్యర్థి మాత్రం గెలవకుండా ఉండేందుకే బీఆర్ఎస్ తన అభ్యర్థిని మార్చినట్టు తెలుస్తోంది. ఈటల కూడా ఒకప్పటి పాత మిత్రుడే కనుక ఇలాగైనా సంతృప్తి చెందొచ్చనే ఆలోచనలోనూ బీఆర్ఎస్ శ్రేణులున్నాయని మల్కాజిగిరి నియోజకవర్గంలో రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.


రాగిడి లక్ష్మారెడ్డి

ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 14 : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను భారీగా పెంచేందుకు అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీవోల, టీఏలతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గ్రామ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ కూలీల సంఖ్యను పెంచాలని, పని కావాలని అడిగిన ప్రతీ ఒక్కరికి కూలి కల్పించేలా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామా ల్లో జాబ్‌కార్డున్న వారందరికీ పనికల్పిస్తూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అనుకున్న అంచనా ప్రకారం కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. క్లస్టర్ వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఊరికి ఉపయోగపడే పనులు చేపట్టాలని, గ్రామాల్లో ఉండే సమస్యలన్నీ మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు అందాలన్నారు. పైప్‌లైన్లు, నల్లాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎక్కడా సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా పైప్‌లైన్ల లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పంచాయతీ సెక్రటరీలు, ఏఈలు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో నీటి సమస్యపై సమావేశాలు ఏర్పాటు చేసుకొని సమస్య వచ్చిన చోట్ల పరిష్కరించేలా పనిచేయాలన్నారు. ఈ నెల 18 నుంచి మొదలయ్యే పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. జిల్లాలో మొత్తం 80 సెంటర్లు ఏర్పాటు చేశామని, మాస్ కాపీయింగ్‌లు జరుగకుండా చూడాలని, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఇతర సౌకర్యాలుండేలా చూడాలన్నారు. పరీక్షల సమయాల్లో అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, అలాగే పరీక్ష కేంద్రాలకు దగ్గరగా జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఎగ్జామినేషన్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు సెల్‌ఫోన్లు తీసుకురానీయొద్దని, ప్రతి సెంటర్‌కు ఒక స్పెషల్ అధికారిని నియమించామని, వారు ముందే పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లి అన్నీ చెక్ చేసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ శ్రీనివాసులు, జడ్పీ సీఈవో సుధీర్, డీఈవో రేణుకాదేవి, డీపీవో సుధారాణి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, గ్రిడ్ ఈఈ చల్మారెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి

మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రానున్న లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వెయలెన్స్, వీడియో, వీవింగ్ సర్వెయలెన్స్, ఎంసీసీ బృందాలతో డీసీవో రాజేందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశూరామ్‌లతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తిసుందన్నారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు నిరంతరం పర్యవేక్షణలో ఉంటాయన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు వంటి వాటిని ఎక్కడికక్కడ నియంత్రించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులు వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏవైనా అనుమానాలు, ఇబ్బందులు, తెలియని విషయాలుంటే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యాత్మక ప్రదేశాలకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సకాలంలో చేరుకోలేకుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలన్నారు. స్టాటిక్ సర్వేయలన్స్‌లు చురుగ్గా పనిచేయాలన్నారు. ఎక్కడైనా రూ.50వేల కంటే ఎక్కువ నగదు రవాణా చేస్తున్నట్లు తెలిస్తే సందేహాస్పద నగదును సీజ్ చేసి ట్రెజరీలో డిపాజిట్ చేయాలన్నారు. సీజ్ చేసిన నగదును తిరిగి తీసుకునేందుకు ప్రజలు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ కమిటీకి తగిన ఆధారాలు చూపించి తమ డబ్బును విడుదల చేసుకోవచ్చునన్నారు. రాజకీయ ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా ద్వారా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. సీ-విజిల్ యాప్, ఈ-ఎస్ఎంఎస్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో కంప్లైంట్‌ను ఛేదించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, కోడ్ రాగానే నిర్వహించే విధుల పట్ల అవగాహన కల్గి ఉండాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిపై జిల్లా ట్రైనర్లు అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు


పరీక్షలు పూర్తిచేసుకొని వికారాబాద్ బస్టాండ్ నుంచి సొంతూళ్లకు వెళ్తున్న ఇంటర్ విద్యార్థులు

వికారాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలకు 6,447 మంది విద్యార్థులకు 6,301 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 1,298మంది విద్యార్థులకు 1,255 మంది పరీక్షలు రాశారు. జనరల్ కోర్సుల పరీక్షలు గురువారంతో ముగియగా, ఒకేషనల్ కోర్సుల పరీక్షలు మరో రెండు రోజులు కొనసాగనున్నాయి. జిల్లాలో ఇంటర్ జనరల్ కోర్సుల పరీక్షలు ముగిశాయని నోడల్ అధికారి శంకర్ తెలిపారు. సెకండియర్ చివరి రోజు కాపీ కొడుతున్న 8 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. పెద్దేముల్ జూనియర్ కళాశాలలో ఆరుగురు, కోకట్‌లోని గురుకుల కళాశాలలో ఇద్దరు విద్యార్థులు కాపీ కొడుతూ పట్టుబడగా ఇంటర్ బోర్డు అధికారులు డీబార్ చేశారని డీఐఈవో తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

పరిగి,మార్చి 14: గంగపుత్ర కార్పొరేషన్ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ, పరిగి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం పరిగిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ రాష్ట్ర కార్యదర్శి అనెం అంజనేయులు మాట్లాడుతూ, గంగపుత్రుల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాయకులు డి.లక్ష్మణ్, బిచ్చయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గంగపుత్రులు

'ధరణి' సమస్యలను పరిష్కరించాలి

పెద్దేముల్, మార్చి 14: ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయి విచారణ జరిపి త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. పెద్దేముల్ మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని అక్కడి అధికారులతో మాట్లాడారు. ధరణి సమస్యలపై వాకబు చేశారు. ధరణిలో ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారనే విషయాలపై ఆరాతీశారు. ఈనెల 17వరకు కొనసాగే ధరణి స్పెషల్‌డ్రైవ్‌లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఛాంబర్, రిజిస్ట్రేషన్ ఛాంబర్లను, రికార్డు గదులను పరిశీలించారు. రాబోవు ఎన్నికల్లో కూడా సక్రమంగా పనిచేయాలని సూచించారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

వాటర్‌ప్లాంట్స్‌పై చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్స్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, జోగు లాలయ్య, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పర్యాటక రంగంలో డ్రైవర్ల పాత్ర కీలకం

» ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ జయదేవ్


శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్యాబ్‌డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగంలో క్యాబ్ డ్రైవర్లది కీలక పాత్ర అని, టూరిజానికి వారు బ్రాండ్ అంబాసిడర్లు అని ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ అన్నారు. గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో అతిథి దేవో భవ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. 200 మంది క్యాబ్‌డ్రైవర్లకు రెండు సెషన్లలో ప్రయాణికులు, పర్యాటకుల పట్ల పాటించే మర్యాదలు, పరిశుభ్రత, సీపీఆర్ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. జయదేవ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందాలంటే క్యాబ్/ఆటోడ్రైవర్ల పాత్ర చాలా కీలకమని అన్నారు. విమానాశ్రయం, రైల్వేస్టేషన్లు, డ్రైవర్లు ప్రయాణికులతో ఎలా మెలగాలి అనే విషయమై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో పాల్గొన్న డ్రైవర్లందరికీ ఐఐహెచ్‌ఎం ఇంటర్నేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీమతి మీనాక్షితో డ్రైవర్లు ఇతరుల పట్ల పాటించే మర్యాదలు, వస్త్రధారణ, నడవడికపై శిక్షణ ఇప్పించారు. కాగా, ఎఫ్‌టీసీసీఐ టూరిజం కమిటీ క్యాబ్ డ్రైవర్లకు శుభోదయం, స్వాగతం, ధన్యవాదాలు, దయచేసి, మేఐ హెల్ప్‌యూ వంటి కొన్ని పదాలు నేర్పించారు. హైదరాబాద్ నగరంలో చారిత్రాత్మక పర్యాటక ప్రదేశాలపై అవగాహన కల్పించి డ్రైవర్లకు సీపీఆర్ కిట్లను అందజేశారు. టూరిజం కమిటీ చైర్‌పర్సన్ రాఖీ కంకారియా, తెలంగాణ ప్రభుత్వం పర్యాటక శాఖ, జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, అపోలో హాస్పిటల్స్, కోరారి గ్రూప్, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా, ఐఐహెచ్‌ఎం త్రిపుర కన్‌స్ట్రక్షన్ భాగస్వామ్యంలో కార్యక్రమం నిర్వహించారు.


ఎమ్మెల్యే శంకర్‌ను పరామర్శిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఎమ్మెల్యే వీర్లపల్లికి వడదెబ్బ

» లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ

» ఆస్పత్రిలో చేరిన శంకర్.. నిలకడగా ఆరోగ్యం

షాద్‌నగర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వడదెబ్బకు గురయ్యారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీ చంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాప్‌రెడ్డిలతో కలిసి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్‌కు వడదెబ్బ తగిలింది. దాదాపుగా అన్ని మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే.. కొందుర్గు మండలానికి చేరుకునే సరికి నీరసించి పోయారు. జిల్లేడ్-చౌదరిగూడ మండలంలో సాయంత్రం నిర్వహించిన బైక్ ర్యాలీలో శంకర్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో నాయకులు వెంటనే ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం శంషాబాద్‌లోని లిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా, నేడు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరిపేందుకు నాయకులు భారీఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా, కార్యకర్తలు, అభిమానులు నిరాశ చెందవద్దని ఎమ్మెల్యే సూచించారు. తనకోసం ఎవరూ ఆసుపత్రికి రావొద్దని, మూడు రోజులు విశ్రాంతి తీసుకోమని వైద్యులు సలహా ఇచ్చారని చెప్పారు.

భూవివాదంలో జోక్యం.. 36 మందిపై కేసు

» ఈనెల 3న కేసు నమోదు.. ఐదుగురి రిమాండ్

» పరారీలో కల్వకుంట్ల కన్నారావు.. ఆలస్యంగా వెలుగులోకి ఘటన

» ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో భూ వివాదం


వివాదానికి కారణమైన భూమి

ఆదిభట్ల, మార్చి 14 : భూ వివాదంలో తలదూర్చిన మాజీ సీఎం కేసీఆర్ బంధువు సహా 36 మందిపై కేసు నమోదైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కిడి సురేందర్‌రెడ్డి అనే వ్యక్తికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 32లో వేద కన్వెన్షన్ ఎదురుగా 2.15 గుంటల భూమి ఉంది. సురేందర్‌రెడ్డి ఆ భూమిని చామ సురేష్ అనే వ్యక్తి దగ్గర దాదాపు కోటి రూపాయలు తీసుకొని 2013లో జీపీఏ చేశాడు. తిరిగి డబ్బులు చెల్లించాక భూమిని తన పేరున చేసేలా ఒప్పందం చేసుకున్నాడు. రెండు నెలల తర్వాత సురేష్ భూమిని సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఈక్రమంలో తిరిగి డబ్బులు చెల్లిస్తానని చెప్పిన సురేందర్ రెడ్డి.. 2020 వరకు తిరిగి ఇవ్వకపోవడంతో సురేష్ ఓఎస్ఆర్ గ్రూప్ అనే సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌కు భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. 2020 నుంచి ఇప్పటివరకు ఆ భూమి ఓఎస్ఆర్ గ్రూప్ సంస్థ అధీనంలోనే ఉంది. జక్కిడి సురేందర్‌రెడ్డి.. చామ సురేష్‌తో భూమి విషయం తేల్చుకుంటామని, మధ్యలో మీరెందుకు భూమిని కొన్నారంటూ ఓఎస్ఆర్ గ్రూప్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌తో తరచూ గొడవకు దిగుతూ భూమి హద్దులు తొలగించడం వంటి చర్యలకు పాల్పడ్డాడు. సురేందర్‌రెడ్డితో పాటు అతడి సోదరులపై గతంలో కేసులు నమోదయ్యాయి. దాంతో అతడు బొల్లారంలో ఉండే సురేష్ మామ చంద్రారెడ్డి ద్వారా మాజీ సీఎం కేసీఆర్ బంధువు కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును కలిశాడు. భూ వివాదంలో జోక్యం చేసుకుని సర్దుబాటు చేయడానికి కొంత డబ్బు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందులో కొంత అడ్వాన్స్‌గా ఇచ్చి 2021లో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం(దాదాపు రూ.2 కోట్లు మాట్లాడుకోగా.. అడ్వాన్స్‌గా రూ.40 లక్షలు తీసుకున్నట్లు సమాచారం). ఒప్పందం కుదుర్చుకొని రెండేళ్లు గడిచినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో.. జక్కిడి సురేందర్ రెడ్డి కన్నారావుపై ఒత్తిడి పెంచారు. ఈనెల 3న తెల్లవారుజామున 3 గంటలకు కల్వకుంట్ల కన్నారావు అతడి అనుచరులు డానియేలు, శివలతో పాటు సుమారుగా నలభై మంది వరకు వచ్చి.. భూమి వద్ద వాచ్‌మన్, సెక్యూరిటీ గార్డులపై దాడిచేసి గాయపరిచారు. అక్కడ వాచ్‌మెన్ కోసం వేసిన గుడిసెను తగలబెట్టి జేసీబీ సాయంతో భూమి చుట్టూ ఏర్పాటుచేసిన ప్రీకాస్ట్ ప్రహరీని కూల్చి వేశారు. డయల్ 100 ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ డ్రైవర్‌తో పాటు ఓనర్‌ను మరో ముగ్గురు.. మొత్తం 5 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జక్కిడి సురేందర్‌రెడ్డి, హరినాథ్, కన్నారావులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పర్యవేక్షణలో పన్నెండు మందితో కూడిన మూడు పోలీసు బృందాలు వారికోసం గాలిస్తున్నాయి. ప్రస్తుతం బెంగళూరులో వారు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.


జేసీబీతో ప్రీకాస్ట్ గోడను కూల్చి వేయిస్తున్న కన్నారావు అనుచరులు(ఫైల్)

పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం



ఈనెల 3న మన్నెగూడ వేద కన్వెన్షన్ సమీపంలో గొడవ జరుగుతున్నట్లు డయల్ 100కు సమాచారం వచ్చింది. ఎస్ఐ రాజు మిగతా సిబ్బంది అక్కడికి చేరుకొని జేసీబీని సీజ్‌చేసి డ్రైవర్‌తో ఓనర్‌ను అదుపులోకి తీసుకున్నాం. ఐదుగురిని రిమాండ్ చేశాం. పరారీలో ఉన్నవారిని అదుపులోకి తీసుకుంటాం.

- రాఘవేందర్ రెడ్డి, సీఐ, ఆదిభట్ల


మేళాలో బోధనోపకరణాలను పరిశీలిస్తున్న విజయకుమారి

భూగర్భ జలాలను పెంపొందించాలి

» కేంద్రీయ భూగర్భ జల రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి

వికారాబాద్, మార్చి 14 : భూగర్భ జలాలను పెంపొందించేందుకు వర్షపు నీటిని సంరక్షించుకోవాలని కేంద్రీయ భూగర్భ జల బోర్డు రీజినల్ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'భూగర్భ జలాలు-సమస్యలు-నిర్వహణ' అనే అంశంపై ఉపాధి హామీ క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథి కృష్ణమూర్తి మాట్లాడుతూ కరువు ప్రభావంతో ఉపరితల జలం మానవ అవసరాలకు సరిపోవడం లేదన్నారు. ప్రతీ నీటి బిందువును ఒడిసిపట్టేందుకు పెద్ద మొత్తంలో చెక్ డ్యాంల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. డీఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు చురుగ్గా పాల్గొని భూగర్భ జల మట్టాలను పెంచేలా తగు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ కార్యాక్రమం కింద చెరువు, కుంటల్లోకి వర్షపు నీరొచ్చేలా ఫీడర్ చానెళ్ల ఏర్పాట్లకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భూగర్భ జలాల శాస్త్రవేత్తలు రాణి, డాక్టర్ సుధీర్‌కుమార్, టి.మాధవ్, అధర్వ పవార్, యాదయ్య, శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ అభివృద్ధికి రూ.68లక్షలు మంజూరు

మేడ్చల్ టౌన్, మార్చి 14: మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రూ.68లక్షలు మంజూరు చేసినట్లు మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకుడు వేముల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇది వరకు సీఎంకు వినతిపత్రం అందించగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలమేరకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రూ.18లక్షలతో కిష్టాపూర్ అర్చన కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.10లక్షలతో గిర్మాపూర్‌లో సీసీరోడ్డు, మరో రూ.10లక్షలతో 2వ వార్డుల్లో సీసీరోడ్డు కింది బస్తీలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.10లక్షలు, మారుతీ అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయించినట్లు తెలిపారు. నిధుల కేటాయింపుపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

హక్కుల కోసం పోరాడిన తత్వవేత్త కార్ల్‌మార్క్స్

వికారాబాద్, మార్చి 14: ప్రపంచ కార్మికుల హక్కుల కోసం, దోపిడీ లేని సమాజం కోసం పోరాడిన తత్వవేత్త కార్ల్‌మార్క్స్ అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మైమహేందర్ అన్నారు. కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్రను మార్చడానికి అహర్నిశలు కృషిచేసిన మహనీయుడు కార్ల్‌మార్క్స్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాములు, శ్రీనివాస్, రాజేశ్, శ్రీకాంత్, జైపాల్, అశోక్ పాల్గొన్నారు.

బహుజన వాదాన్ని తాకట్టు పెట్టడం అనైతికం

వికారాబాద్, మార్చి 14: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజన వాదాన్ని దొరల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టడం అనైతికమని వికారాబాద్ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ కన్వీనర్ రవీందర్ మహారాజ్ విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారధన్ మహారాజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలను త్రీవంగా ఖండించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, యాదగిరి, వెంకటేశ్, శ్రీనివాస్, అశోక్, మల్లేశ్, రాజు, సత్యం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజ మార్గం

వికారాబాద్, మార్చి 14: రాజీ పడదగిన కేసులలో రాజీ కుదుర్చుకునేందుకు ఈనెల 16న న్యాయ శాఖ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ ఏర్పాటు చేయనున్నట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గమే రాజ మార్గమని అన్నారు. కేసుల్లో రాజీ అవ్వాలనుకున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లలో కేసులు ఉన్నవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

చిట్టిఘనాపూర్ పంచాయతీ సందర్శన

తాండూరురూరల్, మార్చి 14: మండలంలోని చిట్టిఘనాపూర్ పంచాయతీని గురువారం డీఎల్‌పీవో శంకర్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని కంపోస్ట్‌షెడ్డు, శ్మశానవాటిక, వన నర్సరీ, తాగునీటి ట్యాంకును సందర్శించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

షాద్‌నగర్, మార్చి 14 : కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌కు మద్దతుగా గురువారం షాద్‌నగర్ నియోజకవర్గంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని విమర్శించారు. ఆ రెండు పార్టీలు మాటల గారడీలు తప్ప పేద ప్రజల అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు మారుతాయని వంశీచంద్‌రెడ్డి అన్నారు. దేశంలో తిరిగి ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలుపించాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పాలమూరు ప్రజావాణిని పార్లమెంట్‌లో లేవనెత్తి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాల జడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



కడ్తాల్ మార్చి 14 : మండల పరిధిలోని చరికొండ శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. చరికొండతో పాటు కడ్తాల, ఆమనగల్లు, యాచారం, కందుకూరు, ఇబ్రహీంపట్నం నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు గురువారం మోహినిసేవ, గరుడసేవ, ఎదుర్కోళ్లు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించే స్వామి వారి కల్యాణానికి ఆలయం వద్ద పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుడు, నిర్వాహకుడు చక్రవర్తి శ్రీనివాసాచార్య, ఎంపీటీసీ పాలకుర్ల రాములు, మాజీ సర్పంచ్‌లు నర్సింహాగౌడ్, లక్ష్మయ్య, భీష్మాచారి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

» 8 రోజుల పాటు నిర్వహణ » భక్తులకు విశాల ఏర్పాట్లు

» 28న తిరుకల్యాణం, 29న రథోత్సవం




బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన మండపం

తలకొండపల్లి, మార్చి 14 : ప్రాచీన దేవాలయంగా ఖ్యాతి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ అలివేలుమంగ, గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ దేవాలయంలో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 24నుంచి 31 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక నేపథ్యంలో నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పచ్చటి తోరణాలతో శోభాయామానంగా అలంకరించారు. 8 రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ఈఓ స్నేహలత, ఆరాధకులు నడాదూర్ రామాచార్యులు, పరవస్తు గోపాలాచార్యులు వివరించారు. 24న అభిషేకం, రుత్విక్‌కరణం, స్వస్తివాచనం, మృత్సంగ్రహనం, అంకురార్పన, 25న ఆదివాసం, ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వానం, హోమం, బలిహరణం, సింహవాహన సేవ, 26న పారాయణం, బలిహరణం,హంసవాహన సేవ, హనుమంత వాహనం, 27న పారాయణం, మోహిని సేవ, బలిహరణం, హోమం, గరుడసేవ, ఎదుర్కోళ్లు, 28న తిరుకల్యాణం, గజవాహనసేవ, 29న నిజరూప దర్శనం, మహాభిషేకం, రథోత్సవం, 30న అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, లంకాదమానం, అశ్వవాహనం, 31న చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన , ధ్వజాఅవరోహణం, పందెం గుండు పోటీ ఉంటాయని వారు తెలిపారు.

అవినీతి రహిత ప్రజాపాలనే కాంగ్రెస్ ధ్యేయం

» మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

మహేశ్వరం, మార్చి 14 : అవినీతి రహిత ప్రజాపాలనే కాంగ్రెస్ ధ్యేయమని, నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ఖాళీ చేసి కాంగ్రెస్‌ను బలమైన పార్టీగా తయారు చేయాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. గురువారం మహేశ్వరంలో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను పార్టీ ఎప్పుడు మరిచిపోదన్నారు. గత ప్రభుత్వహయాంలో విచ్చలవిడిగా అవినీతి జరిగిందని ఆరోపించారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేసేలా చూస్తామన్నారు. కాంగ్రెస్ మండల, గ్రామ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మహేశ్వరం లోని శ్రీరాజరాజేశ్వరాలయం, మన్‌సాన్‌పల్లిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా లాజర్

కాంగ్రెస్ మహేశ్వరం పట్టణ అధ్యక్షుడిగా లాజర్, ప్రచార కార్యదర్శిగా శంకర్, అశోక్, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏనుగుజంగారెడ్డి, కూనయాదయ్య, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, అల్లెకుమార్, రఘుపతి, కె. రాములు, దోమ శ్రీనివాస్‌రెడ్డి, రాజు నాయక్, లాజర్, శ్రీకాంత్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం, సంగీతంతో మానసిక ప్రశాంతత

» పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్ » కన్హా శాంతివనంలో ఘనంగా ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవం

» మొదటిరోజు ఆకట్టుకున్న ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ కచేరీ » వేల సంఖ్యలో హాజరైన యోగా అభ్యాసకులు


సంగీత కచేరీ నిర్వహిస్తున్న ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ బృందం

నందిగామ, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : ధ్యానం, శాస్త్రీయ సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాంచంద్ర మిషన్ గురూజీ, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్ అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతివనంలో రాంచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఆధ్యాత్మిక సమ్మేళనంలో భాగంగా మొదటిరోజు గురువారం ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ కచేరీ నిర్వహించి పాటలతో అలరించారు. కమలేష్ పటేల్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక సమ్మేళనం ప్రపంచ శాంతికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కన్హా శాంతివనానికి 130 దేశాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యాసకులతో ఆశ్రమంలో పండగ వాతవరణం నెలకొంది.

నేడు హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రేపు ఉపరాష్ట్రపతి..

గురువారం నుంచి ఈ నెల 17 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక మహోత్సవంలో భాగంగా నేడు(శుక్రవారం) రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రేపు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ హాజరుకానున్నారు. రాష్ట్రపతి రాక సందర్భంగా పోలీసులు కన్హా శాంతివనంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్రపతి గ్లోబల్ స్పిరిచ్యువాలిటీ మహోత్సవ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల నుంచి సుమారు 300 ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, అన్ని మతాలకు చెందిన మతపెద్దలతో పాటు లక్ష మందికి పైగా ప్రముఖులు హాజరుకానున్నారు. దేశ విదేశాల నుంచి చినజీయర్‌స్వామి, అభిజిత్ హెల్డర్, ఆచార్య ధీరేంద్ర కృష్ణశాస్త్రి, రాందేవ్‌బాబా, భావజైన్, బీకే మృత్యుంజయ, శివాని, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమలేష్ పటేల్, దస్తూరిజీ ఖుర్షీద్, దేవి చిత్రలేఖ, స్వామి చిదానంద, జగద్గురు రామభద్రాయచారి, మాతా అమృతామయి, ఆర్ట్ ఆఫ్‌లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్, సినీ ప్రముఖులు వెంకటేష్, సమంత, కీర్తిశెట్టి, కబీర్‌బేడీ, మాధుర్ బండార్కర్, శేఖర్ కపూర్, శంకర్ మహదేవన్ తదితరులు తరలిరానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న అభ్యాసకులు, తదతరులు

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 14: ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు జరుగనున్న పరిగిలోని శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఆలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు గతంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో జరిగేవని, ఈసారి నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుండడం శుభపరిణామమని అన్నారు. గతంలో కంటే భిన్నంగా పెద్దఎత్తును ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. అందుకు తాను అన్ని రకాలుగా సహకారం అందిస్తానని తెలిపారు. ఉత్సవాలకు పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పరిగి మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారధి, మాజీ జడ్పీటీసీ ఎస్‌పి బాబయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కడ్మూరు ఆనందం, నాయకులు పి.చిన్ననర్సింహులు, అనెం ఆంజనేయులు, పాలాది శ్రీనివాస్, బాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మతండాలో సమస్యలు పరిష్కరిస్తాం

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి


మైసమ్మతండాలో సంత్‌సేవాలాల్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, మార్చి 14: మండలంలోని మైసమ్మతండాలో సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. గ్రామంలో గురువారం నిర్వహించిన సంత్‌సేవాల్ మహరాజ్ పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ తండాలో తాగునీటి పరిష్కారానికి బోరు వేస్తామన్నారు. అదేవిధంగా బస్సు సౌకర్యం ఏర్పాటుకు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో చర్చిస్తామన్నారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు ఉత్తంచంద్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, గోశాల అధ్యక్షుడు సాయిపూర్ బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ వడ్డె శ్రీనివాస్, ఎంపీటీసీ రాజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు జగదీష్, యువ నాయకుడు పురుషోత్తం, రాంచంద్రారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అంజాద్, రామలింగేశ్వరాలయ చైర్మన్ ప్రవీణ్‌గౌడ్, నాయకులు శామప్ప, నారా యణరెడ్డి, యాదయ్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వెంకట్ రాంనాయక్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నీటి ప్యాకెట్ల తయారీ స్థావరంపై ఎస్‌వోటీ పోలీసుల దాడి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 14: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటి ప్యాకెట్లను తయారు చేస్తున్న స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధి బాలాజీనగర్ రేల్వేగేటు సమీపంలో జహంగీర్‌పాషా కొంతకాలంగా నీటి ప్యాకెట్లను తయారు చేస్తున్నాడు. నీటిప్యాకెట్ల తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు దాడిచేసి 20సంచుల నీటి ప్యాకెట్లు, తయారీ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. జహంగీర్ పాషాను అదుపులోకి తీసుకోని ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

- తొమ్మిది మందికి జరిమానా

తాండూరు: మార్చి 14: మద్యం సేవించి వాహనం నడిపిన పాత తాండూరు చెందిన వై.రాజేందర్‌కు రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి నామాల అశోక్ తీర్పు చెప్పినట్లు తాండూరు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించిన ఏడుగురికి రూ.1000 చొప్పున, ఇద్దరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

తాండూరు రూరల్, మార్చి 14: ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తాండూరు మండలంలోని మిట్టబాస్పల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంగలి పండరి(56) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో బుధ వారం ఓ మహిళ మృతిచెందగా ఆమె అంత్యక్రియలకు వెళ్లాడు. అనంతరం పండరి రుద్దనూరు నర్సింహులుతో కలిసి మార్గమధ్యలో ఉన్న బావివద్ద కాళ్లు, చేతులు కడుక్కునేందుకు దిగారు. నర్సింహులు బయటికి రాగా, పండరి నేను వస్తాను నువ్వు వెళ్లాలని చెప్పడంతో ఆయన వెళ్లిపోయాడు. పండరి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య లక్ష్మి వెతికినా ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు గురువారం ఉదయం గ్రామస్తులు మోహన్‌రాజ్, రబ్బాలు బావి వద్ద చెప్పులు, దుస్తులను చూసి లక్ష్మికి సమాచారం అందించారు. పండరి మృతదేహాన్ని గ్రామస్తులు వెలికితీశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత


మృత్యువాతపడిన గేదె వద్ద బాధిత రైతు, స్థానికులు

కులకచర్ల, మార్చి 14: విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందిన సంఘటన కులకచర్ల మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. సాల్విడ్ గ్రామానికి చెందిన రైతు సాయన్న పొలంలో గురువారం సాయంత్రం గేదెలు మేస్తున్నాయి. అందులో ఓ గేదె మేత మేస్తూ విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు తీగకు తగిలింది. సపోర్టు తీగకు విద్యుత్ సరఫరా కావడంతో గేదె షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ప్రజాసమస్యలపై నిర్లక్ష్యంగా ఉండొద్దు


మంతన్‌గౌడ్‌లో సీసీరోడ్డును పరిశీలిస్తున్న బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, మార్చి 14: ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని మైల్వార్, మంతన్‌గౌడ్ గ్రామాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కార్యదర్శులతో కలిసి పలు వార్డుల్లో పర్యటించి సమస్యలపై దృష్టి సారించారు. కుళాయిలకు ఆన్‌అఫ్ సిస్టం లేకపోవడంతో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ఉపాధి నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి వృథాను పూర్తిగా కట్టడి చేయాలని సూచించారు.

ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా భీమారాజ్


భీమారాజ్

కొడంగల్, మార్చి 14: రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్‌ఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కొడంగల్ పట్టణానికి చెందిన భీమారాజ్‌ను ఎన్నుకున్నారు. ఆర్‌ఎస్‌యూ వ్యవస్థాపక అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడిగా భీమారాజ్, ప్రధానకార్యదర్శిగా సురేశ్‌గౌడ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా భీమారాజ్ మాట్లాడుతూ 2012 నుంచి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేశానని తెలిపారు. భవిష్యత్‌లో ఆర్‌ఎస్‌యూ విద్యార్థిసంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం

తాండూరు/ తాండూరు రూరల్, మార్చి 14: మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మరాటి నర్సింహులుకు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 13, 14వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఆంధ్ర లయోల కళాశాలలో తెలుగు సాహిత్యం-సామాజిక స్పృహ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సభాధ్యక్షులుగా మరాఠి నర్సింహులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన తాండూరుకు చెందిన ప్రముఖ కవి వడిచర్ల సత్యం రచించిన మణిపూసల ప్రక్రియ, లఘురూప గేయప్రక్రియ, మణిపూసలు-సామాజిక స్పృహ అనే అంశాలపై పత్రసమర్పణ చేశాసి, చదివి వివరించారు. ఈ సందర్భంగా నిర్వహకులు నర్సింహులును సన్మానించి అభినందించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. తాండూరు ప్రాంత కవులు, గ్రామస్తులు, విద్యావంతులు నర్సింహులును అభినందించారు.

డీసీఎంఎస్ మేనేజర్‌గా వెంకటయ్య


వెంకటయ్య

పరిగి, మార్చి 14: డీసీఎమ్మెఎస్ పరిగి శాఖ మేనేజర్‌గా దోమ వెంకటయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. దాండూరులో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న వెంకటయ్య పదొన్నతిపై పరిగి మేనేజర్‌గా వచ్చారు. ఇక్కడ పని చేసిన వెంకట్‌రాంరెడ్డి కేంద్రకార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి


ప్రచారం చేస్తున్న క్షమిత

మేడ్చల్ టౌన్, మార్చి 14: మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు గురువారం మేడ్చల్ పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈటల రాజేందర్ కోడలు క్షమిత ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులు మున్సిపల్ పరిధిలోని పలువార్డుల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు


నీటి కుళాయిలను తనిఖీలు చేస్తున్న మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 14: మున్సిపల్ పరిధిలో నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో గురువారం నల్లాలకు మోటార్లు బిగించి నీటి పాల్పడుతున్న ఇళ్లపై మున్సిపల్ సిబ్బందితో కలిసిన కమిషనర్ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లాలకు బిగించిన మోటార్లను మున్సిపల్ సిబ్బంది జప్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవి ముగిసేంత వరకు పట్టణవాసులకు నీటి కొరత లేకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని కాలనీల్లో నల్లాలకు మోటార్లు బిగించి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం నీటి కొరత లేకుండా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నామని కమిషన్ చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, మార్చి 14: మున్సిపాలిటీ పరిదిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో గురువారం రూ.35లక్షల మున్సిపాలిటీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో సీసీరోడ్లు, బీటీ రోడ్లతో పాటు డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి పైప్ లైన్ల నిర్మాణాలు పూర్తి చేసినట్లు గుర్తుచేశారు. వీకర్ సెక్షన్ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీహాల్ స్థానికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చాలి

పోచారం మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మర్చడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయం వద్ద దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధంపై ఏర్పాటు చేసిన అవగాహనలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లతో ప్రమాదం పొంచి ఉన్నదని గుర్తుచేశారు. నాలుగు సంవత్సరాలుగా దుకాణదారులకు, ప్రజలకు పలు మార్లు అవగాహన కల్పించామన్నారు. అయినా పరిస్థితిలో మార్పు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మొక్కజొన్న పిండితో తయారయ్యే కవర్ల డీలర్ షిప్‌ను డ్వాక్రా సంఘాలకు అప్పగిస్తామని వారి వద్ద నుంచి దుకాణదారులు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజశేఖర్, మహేష్, సాయిరెడ్డి, సర్వీ రవీందర్, అక్రం అలీ, ఏఈ నరేష్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, శేఖర్, కాశయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాండూరు రూరల్, మార్చి 14:పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్ అన్నారు. తాండూరు మండలంలోని ఐనెల్లి శివారులోని తెలంగాణ మోడల్ స్కూల్ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులకు గురువారం వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతస్థాయిలో ఉండేలా చదవాలని సూచించారు. తమ భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడాలన్నారు. పట్టుదలతో చదివితేనే ఉనత్నస్థాయికి ఎదుగుతారని అన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణులు కావాలన్నారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షలు 105 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 90మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 90శాతం ఉత్తీర్ణత సాధించామని గుర్తుచేశారు. ఈ ఏడాది 98మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నర్సింహులు, ఐనెల్లి గ్రామ మాజీ సర్పంచ్ స్వప్నజ్యోతి, మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కీసర సీఐ వెంకటయ్య, కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు

కీసర రూరల్, మార్చి 14 : స్నేహపూర్వక వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. కీసర పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో గురువారం మండల పరిధిలోని వివిధ మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో శాంతి సమావేశం(పీస్ కమిటీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్లాం మతానికి చెందిన రంజాన్ మాసం కొనసాగుతుందన్నారు. ఇదే సమయంలో హిందువులకు ప్రతిష్టాత్మకమైన హోలీ ఇదే సమయంలో వస్తుందన్నారు. ఆయా పర్వదినాలను సామరస్యంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. చట్టానికి అతీతంగా ఎవరు ప్రవర్తించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేష్, రాజశేఖర్, మధు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మేడ్చల్ టౌన్, మార్చి 14: మండలలోని లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల లబ్ధిదారులతో పాటు మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలి

ఘట్‌కేసర్, మార్చి 14: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగుట్ట కాలనీలో, కొండాపూర్‌లోని సర్వేనెంబర్ 257లోని ప్రభుత్వ భూముల్లో జోరుగా అక్రమనిర్మాణాలు చేపడుతున్నారని తక్షణమే చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ ఘట్‌కేసర్‌కు చెందిన తోక రాజు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. మైసమ్మగుట్ట కాలనీతోపాటు కొండాపూర్‌లోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులుగాని పట్టాలు లేకుండానే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. దీని వెనుక మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలకు సదరు కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం నుంచి ఇంటి నెంబర్లు ఇప్పిస్తున్నారని వివరించారు. విచారణ జరపాలని కోరాడు.

తిర్మలాపూర్‌లో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిర్మలాపూర్‌లో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు

పూడూరు, మార్చి 14: మండలంలోని తిర్మలాపూర్‌తండాలో 'తాగునీటికి పొలంబాట' అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు తిర్మలాపూర్ క్లస్టర్ జె.శ్రీనివాస్ గ్రామంలో పాడైన పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ మరమ్మతులు పూర్తయితే తాగునీటి సమస్య తీరుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కులకచర్ల, మార్చి 14: ఈ నెల 18 నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కులకచర్ల ఎంఈవో హబీబ్ అహ్మద్ తెలిపారు. ఉమ్మడి కులకచర్ల మండలంలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాల్లో 1058 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, డ్యూయల్ డెస్కులు, విద్యుత్ తదితర వసతులను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈవో తెలిపారు. ఒక్క నిమిషం నిబంధన లేదని స్పష్టం చేశారు. పరీక్షా సమయానికి 5నిమిషాల వరకు అనుమతి ఉంటుందన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి కృషి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 14: జిల్లా పరిషత్ అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఎదులాబాద్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు కందుల కుమార్ తెలిపారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ ఎదులాబాద్ పాఠశాలలో అదనపు గదుల కోసం ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎదులాబాద్ జిల్లా పరిషత్ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని గుర్తుచేశారు. ఈ నిధులతో పాఠశాల అదనపు గదులు నిర్మించనున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి అదనపు గదులు పూర్తయ్యే విధంగా చూడాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, మార్చి 14: సీఎం రేవంత్‌రెడ్డిని కొడంగల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రచార కార్యదర్శి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి అరబ్ రమేశ్, రేవంత్ మిత్ర మండలి నాయకులు కే.సాయిలు, అశోక్ తదితరులు హైదరాబాద్‌వెళ్లి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు.

డిగ్రీ కళాశాల కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రాజారామ్, అధ్యాపకులు

కొడంగల్ రూరల్, మార్చి 14: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ బీ గ్రేడ్ సాధించిన సందర్భంగా గురువారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ప్రిన్సిపాల్ రాజారామ్ కళాశాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్‌లో 2008లో ప్రారంభమైన కళాశాల అంచెలంచెలుగా విస్తరణతో ఉన్నత విద్యావంతులు, అనుభవజ్ఞులు, డాక్టరేట్ అర్హత కలిగిన అధ్యాపకులతో బోధన జరుగుతోందని తెలిపారు. అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ


పదోతరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ

దోమ, మార్చి 14: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు పూర్వవిద్యార్థి చక్రధర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పరీక్షాప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు, కరీం, రబ్బాని, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం


మంచన్‌పల్లి సురేష్

వికారాబాద్, మార్చి 14: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను ప్రకటించిన మాజీ సీఎం కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకుడు, ఉద్యమ నేత మంచన్‌పల్లి సురేష్ గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోనే తొలిసారిగా బడుగు బలహీనవర్గాల అభ్యర్థిని ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీ మోసపూరిత మాటలతో గద్దెనెక్కి ఆరు గ్యారెంటీలతో అనతికాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రైతులకు రైతుబంధు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారం ఎక్కడుంటే అక్కడికి వెళ్లే నాయకులకు ఈ ప్రాంత ప్రజలు తైన గుణపాఠం చెబుతారని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు భవిష్యత్తు ఉంటుందని కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటామని తెలిపారు.

పూడూరు: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ పూడూరు మండల ఉపాధ్యక్షుడు మహ్మద్ రైస్‌ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా ఎంపిక చేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పార్టీని ఎవరు వీడినా నష్టం లేదని అన్నారు. మళ్లీ తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ పూర్వ వైభవం తెస్తామని, కార్యకర్తలకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

సంక్షిప్తంగా..

- **కొడంగల్:** వేసవిలో తాగునీటి ఎద్దడి, పదో తరగతి పరీక్షలు, ఉపాధిహామీ పనులపై గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వారికి కలెక్టర్ పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉషశ్రీ పాల్గొన్నారు.
- **కులకచర్ల:** విద్యుత్ బిల్లులు ఎవరూ చెల్లించొద్దని కాంగ్రెస్ పార్టీ కులకచర్ల మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతో విద్యుత్ అధికారులు బలవంతంగా బిల్లులను వసూలు చేయరాదన్నారు. డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల గురించి తీసుకెళ్లామని తెలిపారు. వివిధ గ్రామాల ప్రజలు ఎవరూ మార్చి నెల విద్యుత్ బిల్లులు చెల్లించొద్దన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడైనా బలవంతంగా వసూలు చేస్తే పార్టీ దృష్టికి తీసుకురావాలని, అలాంటి అధికారులపై ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.
- **కీసర రూరల్:** మున్సిపల్ పరిధి రాంపల్లిలోని హిందూ వైకుంఠధామంలో గురువారం రూ.15లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులనునాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్లు సరిత, నాగేష్, కళావతి, కో-ఆప్షన్ సభ్యుడు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.
- **శామీర్‌పేట:** విద్యార్థులకు అవసరమైన స్మార్ట్‌క్లాస్ రూమ్‌లను, తదితర సౌకర్యాలను కల్పించడమే సమగ్ర పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవల సంస్థ(సింజీన్), బయోకాన్ ఫౌండేషన్ సంస్థల ధ్యేయమని సైట్‌హెడ్ ఈడె ప్రసాద్ అన్నారు. శామీర్‌పేటలోని జడ్పీఉన్నత పాఠశాల్లో సింజీన్, బయోకాన్ ఫౌండేషన్ సంస్థల భాగస్వామ్యంతో నూతనంగా స్మార్ట్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.
- **శామీర్‌పేట:** మండలంలోని తుర్కపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, ఆయన అనుచరులు దౌర్జన్యంగా దాడి చేసి భూ కబ్జా చేసినట్లు భూ బాధితులు తెలిపారు. తుర్కపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్-206లోని స్వంత పట్టా స్థలంలో గురువారం భూ బాధిత సోదరులు పెద్ది శ్రీనివాస్, పెద్ది పాండులు ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ వారి గోడును వెళ్లబోసుకున్నారు.
- **ధారూరు:** మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో గురువారం గీతాయజ్ఞం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు గీతాయజ్ఞంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మికవేత్త పలువురు దంపతులతో గీతాయజ్ఞం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులందరికీ అన్నదానం చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ మాజీ జిల్లా అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.